


నా గుండె లయ తప్పింది.

రెప్పకొట్టడం మరిచిపోయాను.

ఎదురు మేడమీద గదిలో కిటికీదగ్గర నిలబడి అద్దంలో చూచుకొంటూ అతడు క్రాపు దువ్వుకొంటున్నాడు.

మొన్నటి వరకూ ఆ ఎదురుగావున్న మేడమీద గదులలో ఒక కుటుంబం కాపురం ఉండేది వాళ్ళు ట్రాన్స్ఫరై వెళ్ళిపోయారు. ఇతడు క్రొత్తగా అద్దెకు దిగినట్టున్నాడు. ఇతడికి ఫామిలీ ఉందా? ఒక్కడేనా?

కాలేజీకి టైం అవుతూంది నాకు.

"అన్నం పెట్టాను." అమ్మ వంటింట్లోంచి కేకవేసింది.

"ఆఁ వస్తున్నా."

కంచంలో అన్నం పొగలు గ్రక్కుతూంది.

వాచీకేసి చూశాను. అయిదు నిమిషాలు లేట్.

నాకు తొందరెక్కువైపోయింది. ఆదరాబాదరాగా తింటున్నాను. ఎదురింటి కిటికీ దగ్గర కనిపించిన సుందర రూపం నా మనసులో మెదిలింది. అబ్బ! ఎంత బావున్నాడు?

నిప్పు మింగినట్టుగా నా గొంతు మండింది.

చెంబు ఎత్తి గబుక్కున నోటికి పట్టాను.

"విసనకర్ర ఇవ్వనా? ఏం చదువులో ఏం పరుగులో," అమ్మ అంది.

కళ్లలో తిరిగిననీళ్ళు పమిటతో ఒత్తుకొని తినడం పూర్తిచేశాను. పుస్తకాలు సర్దుకొన్న బాగ్ తీసుకొని, బస్‌ఛార్జీకి పర్సులో డబ్బు చూచుకొని మేడమెట్లు దిగాను.

నా గుండె మళ్ళీ లయ తప్పింది.

అతడూ తాళంచెవి చెయిన్ త్రిప్పుకొంటూ మేడమెట్లు దిగుతున్నాడు. అప్రయత్నంగా పైకి చూశాను. గది కిటికీలుమూసిఉన్నాయి అయితేఒక్కడే ఉంటున్నాడన్న మాట!

ఇద్దరం రోడ్డుమీద కాలుపెట్టాం

అతడు తలెత్తి నావైపు చూశాడు.

చటుక్కున చూపు మార్చాను. చీరకుచ్చెళ్ళు గద్దిగా పైకెత్తి పట్టుకొని గబగబా నడుస్తున్నాను అతడు పాంటు జేబుల్లో చేతులు దూర్చి నడుస్తున్నాడు.

పది నిమిషాల్లో బస్‌స్టాప్ చేరుకొని అతడికోసంచూశాను. అతడు ఇంకొంచెం ముందుకు నడిచి అక్కడున్న లక్ష్మీ రమణ రెస్టారెంట్‌లోకి ప్రవేశించాడు.

సాయంకాలం కాలేజీనుండి వస్తూ ఎదురింటిపైకి చూశాను ఆగదితలుపులు మూసి ఉన్నాయి.

చీరమార్చి ముఖం కడుక్కొని నా గదిలో కిటికీలో కూర్చున్నాను. ఓ పుస్తకం చేతిలోకి తీసుకొని. పది నిమిషాల తరువాత అతడి గది కిటికీ తలుపులు తెరుచుకున్నాయి.

అతడు కిటికీకి వీపుజేసి డ్రెస్ మార్చాక తరువాత ముఖంకడుక్కొని తిరిగి కిటికీ దగ్గరికి వచ్చాడు అద్దం కిటికీలో ఉంచి దువ్వుకోసాగాడు.

నేను ఓరగా చూస్తున్నాను.

అతడు కుర్చీ కిటికీప్రక్కగా జరుపుకొని డైలీపేపరు పట్టుకు కూర్చొన్నాడు.

అతడు నన్ను గమనించలేదు.

పుస్తకం తెరిచి పట్టుకొన్నానుగాని ఒక పేజీకూడా చదవడంలేదు నేను. నా ధ్యాసంతా ఎదురుగాఉన్న కిటికీపైనే ఉంది.

మరురోజు ఉదయం సరిగా ఇద్దరం ఒకేసారి మేడమెట్లు దిగాం. అతడు నన్ను చూడనట్టుగా నడవసాగాడు.

నేను బస్‌స్టాప్ దగ్గర ఆగాను.

అతడు రెస్టారెంట్‌లో దూరాడు.

మూడోరోజు కూడా ఇద్దరం ఒకే

సారి మేడమెట్లు దిగాం కాని అది కాక తాళీయంకాదు. అతడు కిటికీ తలుపులు మూయడంచూసి నా పుస్తకాలబాగ్ అందుకొన్నాను!

వారంరోజులు ఈ రకంగానే గడిచాయి.

నా గదిలో కిటికీ దగ్గర కూర్చొని అతడి దినచర్య గమనించడంలో నాకు ప్రొద్దు తెలియడంలేదు. అతడి గదికి రెండు పెద్ద కిటికీలు ఉన్నాయి. ఆ కిటికీలు తెరిచిఉంచితే ఆ గదిలో ఏమేం జరిగేది స్పష్టంగా కనిపిస్తుంది. అతడు ప్రొద్దున్నే ఆ కిటికీ దగ్గరే నిలబడి గడ్డం గీచుకొంటాడు. తరువాత స్నానం చేసి ఒళ్ళు తుడుచుకొంటూ వచ్చి డ్రెస్ చేసుకొంటాడు. సరిగా ఉదయం ఎనిమిది గంటలకి రెస్టారెంట్ కి బయల్దేరుతాడు. సాయంకాలం ఆ కిటికీ దగ్గిరే పేపరు చదువుతూ కూర్చొంటాడు. చీకటి పడుతూండగా అతడి గదికి అవతల కొద్దిగా ఉన్న ఖాళీస్థలంలో పిట్టగోడమీద కాస్సేపు కూర్చొని చూస్తాడు. చీకటిపడ్డ తరువాత తిరిగి గదిలోకి వచ్చి డ్రెస్ చేసుకొని కిటికీలు మూసివేసి హోటల్ కి వెడతాడు భోజనానికి. తిరిగి వచ్చాక కాస్సేపు చదువుకొంటాడు. తొమ్మిదిన్నర అవుతూంటే దోమతెర క్రిందికి వాల్చుకొని గదిలోలైట్ తీసివేస్తాడు.

అతడి దినచర్య గమనించడంవల్ల నా దినచర్యలో మార్పువచ్చిందె. కాలేజీ నుండి వచ్చాక అమ్మకు పనిలో కొద్దిగా సాయం అయ్యేదాన్ని. పాఠాలు రాసుకొని, ఏరోజువర్క్ ఆరోజు చూచుకొనే దాన్ని. ఇప్పుడు అన్నిటినీ మరిచిపోయాను. ఆ కిటికీవైపు చూస్తూ కూర్చొంటే నాకింకేమీ అక్కరలేదనిపిస్తుంది. కాలేజీకివెళ్ళినా అతడిని మరిచిపోవడం నాకు సాధ్యం కాలేదు.

రోజురోజుకూ అతడు నాలో గాఢమైన అనుభూతి ముద్రిస్తున్నాడు. బ్రహ్మచారి జీవితం ఎంత ఆకర్షణీయం! లైట్ తీసివేసిన ఆ గదిలో..దోమతెరలో ఒంటరిగా శయనించిన అతడి ప్రక్కన చేరగల ఆడదాని అదృష్టం......

పక్కమీదికి చేరితే నాకు ఎంత సేపటికి నిద్రపట్టేదికాదు. ఏవోకలలతో ఆలోచనలతో శరీరం వేడెక్కిపోయేది.

ఒకరోజు ఇద్దరం రోడ్డుమీద నడుస్తున్నాం.

అతడు పాంట్ జేబుల్లో చేతులు దూర్చుకొని, తలవంచుకునడుస్తున్నాడు.

ఎందుకని నావైపు చూడడు? అతడి కంటికి నేనందంగా కనిపించడంలేదా? కాలేజీలో, రోడ్డుమీదా, బస్సుల్లో పది మంది ఆడపిల్లలతో కలిసి ఉన్నా ప్రతి మగాడికన్నా ప్రత్యేకంగా నా మీదనే పడుతూంటుంది! నేను కట్టుకొనే చీరా, పెట్టుకొనే నగలూ ఖరీదైనవి కాకపోయినా నా చీరకట్టులో ఒక

ప్రత్యేకత ఉంటుంది. నా చిరునవ్వు మరొక ప్రత్యేకమైన ఆకర్షణ!

అసలతడికి ఆడవాళ్ళంటేవిముఖమా? ఆడదంటే, అందమైన యువతి అంటే స్పందించని హృదయమా?

బస్‌స్టాప్ సమీపిస్తోంది.

అతడు నావైపు చూశాడు రోడ్డుమీద ఏ షాప్‌నో, బండీనో చూసినంత నిరాసక్తకంగా.

నేను మాత్రం ఈ అవకాశం పోనివ్వలేదు.

గాలం వేస్తున్నట్టుగా గాఢంగా చూశాను. చిరునవ్వు నవ్వాను.

అతడు తెల్లబోయినట్టుగా చూశాడు.

స్టాప్ పదడుగుల దూరం ఉండగానే నేనెక్కవలసిన బస్సు వచ్చి నిలబడింది. గబగబా నడిచాను. అతడి ఆశ్చర్యానికి సమాధానం చెప్పకుండానే.

మరునాడు ఉదయం నేను కిటికీ దగ్గరికి చేరుకొనేప్పటికి అతడు కిటికీ తలుపులు మూసివేస్తున్నాడు. అయిదు నిమిషాలు మించకుండానే అతడు సూట్‌కేస్ పట్టుకొని మెట్లుదిగి రోడ్డుమీదికి వచ్చాడు.

రిక్షాను ఆపి, బేరంమాట్లాడి, ఎక్కి వెళ్ళిపోయాడు.

నా కళ్ళలో నిరాశ నిండిపోయింది. మూసివున్న కిటికీ, నా గుండెల్ని కలిచాయి. నా కళ్ళముందు ఏవో చీకటి తెరలు పరుచుకొన్నాయి.

మూడురోజులు ఈ బాధ అనుభవించాక ఒకనాటి సాయంత్రం తిరిగి గది కిటికీ తలుపులు తెరుచుకొన్నాయి. ఆగిపోయిన ఊపిరి తిరిగి ప్రారంభమైనట్టుగా అనిపించింది.

మరునాడు ఉదయం మామూలుగా రోడ్డుమీద నడుస్తున్నాం.

అతడిని పలుకరించాలనుకొని సిగ్గుపడి ఆగిపోయాను.

అతడినుండి ఎటువంటి ప్రోత్సాహం లేకుండా ఏమని పలుకరిస్తాను? ఏమనుకొంటాడు? అసలు నేనంటే అతడికి ఎటువంటి అభిప్రాయముందో?

ఏం జరిగిందో గుర్తించేలోగానే నా జబ్బపట్టుకొని ఎవరో అవతలికితోశారు. ఆటో కొంచెం ముందుకువెళ్ళి ఆగిపోయింది.


డ్రైవర్ దిగివచ్చాడు. "రోడ్డుమీద కళ్ళుంచుకు నడవక్కరలేదా?" అన్నాడతడు కళ్ళెర్రజేసి.

నాకు సిగ్గుతో చచ్చినంతపనైంది.

"ఏమిటంత పరధ్యానం? ఎంత ప్రమాదంజరిగేది?" అతడు చిరునవ్వుతో మృదువుగా మందలిస్తూ చూశాడు.

ఇందాక నా జబ్బ పట్టుకుత్రోసింది అతడి చెయ్యేనని తెలిసేప్పటికి నా మనసు దూదిపింజలా తేలికైపోయింది.

"ఈరోజు ఎంత ప్రమాదం తప్పించారు? మీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పాలో..." గొణిగినట్టుగా అన్నాను.




"ఎదురింటి అమ్మాయివి కదా? చేరువనేఉంది ఆమాత్రం చేయకపోతే ఎలా? అతడు మళ్ళీ నవ్వాడు.

ఎంత అందమైన నవ్వు!

"నేను ఎదురింటిపిల్లనని గుర్తుందన్నమాట?" సంతోషం, ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అన్నాను.

"ఏం చదువుతున్నావు?"

"బి ఎ. ఫస్టియర్."

"ఏ కాలేజీ?"

"రెడ్డీ కాలేజీ."

"మీ పేరు?"

రాధ ... ... మీరు ఏంచేస్తుంటారు ఇక్కడ?"

"కో-ఆపరేటివ్ ట్రెయినింగ్ అవుతున్నాను."

స్టాప్ వచ్చింది. ఆగాను.

అతడు ఓ క్షణం తరువాత రెస్టారెంట్ వైపు వెళ్ళిపోయాడు.

సాయంత్రం అతడు కిటికీ దగ్గర నిలబడి నన్ను చూసి నవ్వాడు.

నేనూ నవ్వాను. 'దారికి వచ్చాడు!' నా మనసు ఉయ్యాల లూగిపోయింది.

రోజూ ఉదయం రోడ్డుమీద కలిసి నడుస్తున్నాం. అతడు మా ఇంటిసంగతి నా చదువు సంగతి ఏవో పొడి పొడి ప్రశ్నలు వేసేవాడు. నేను జవాబు చెప్పేదాన్ని.

నేనూ, అతడు కిటికీలో నిలబడి నప్పుడు కళ్ళతో మాట్లాడుకోవడం, చిరునవ్వు నవ్వుకోవడం జరుగుతోంది.

మా మధ్య కనిపించని బంధం పెనవేసుకుపోతున్నట్టుగా చూశాడు.

"సినిమాకు వెళదామా?" అన్నానో రోజు.

నా చొరవకు ఆశ్చర్యపోతున్నట్టుగా చూశాడు.

"ఏం పిక్చరు?" అని అడిగాడు.

చెప్పాను.

"ఫస్టు కేనా?" అన్నాడు తిరిగి.

"ఫస్టుషోకే. ఫ్రెండుతో వెడుతున్నానని చెబుతాను ఇంట్లో."

"ఆల్ రైట్."

సాయంకాలం నేను రోడ్డుమీదికి రాగానే అతడి గది కిటికీ తలుపులు మూసుకున్నాయి. అయిదు నిమిషాల తరువాత నెమ్మదిగా వచ్చి నన్ను కలిశాడు.

"మీనాన్నగారు ఏంపనిచేస్తుంటారు?"

"డి ఆర్. ఆఫీసులో క్లర్కుగా. మా అక్కయ్య పెళ్ళయిపోయింది. మా తమ్ముళ్లు చదువుకొంటున్నారు. నా చదువు అతికష్టంమీద సాగుతోంది. మా అమ్మకేమో నా పెళ్ళిచేసి పంపేయాలని తొందర. అప్పుడే ఓ సంబంధంచూశారు. ఆ మధ్య పెళ్ళిచూపులు కూడా అయ్యాయి. ఆ అబ్బాయి నాకు నచ్చలేదు. మా వాళ్ళు ఆ సంబంధమే సెటిల్ చేసేలాగున్నారు."

" ఏం చదువుకొన్నాడతడు?"

"పి. యు. సి. చదివాడు. టీచర్ ట్రెయినింగ్ అయి ఈ మధ్య టీచర్‌గా అపాయింట్ అయ్యాడట. చదువు అంతంతే. రూపంకూడా అంతంతే. నేనేం రంభను కాదనుకోండి. నాకు తగిన వాడైనా కావాలా వద్దా?"

"నీ అందానికేమైంది? నువ్వు చాలా అందంగాఉన్నావు" అంటాడనుకొన్నాను గాని అతడేమీ వ్యాఖ్యానం చేయలేదు.

చెప్పుకోదగ్గ విశేషాలేవీ జరగకుండానే మేం సినిమా చూసి బయట పడ్డాం.

అలా రెండు మూడు సినిమాలు చూశాం.

ఎక్కడ చూసినా సస్నేహంగా పలకరించుకొంటున్నాం. కిటికీ దగ్గర నిలబడి సైగలు చేసుకొంటున్నాం. మా మధ్య విడదీయరాని అనుబంధమేదో ఏర్పడినట్టుగా తోచసాగింది.

ఇప్పటికీ అతడి ప్రవర్తన నిర్మలంగా ఉంది. ఇంతవరకూ ఎలాంటి వికార చేష్టా చేయలేదతడు. అతడి నిగ్రహం నాకే ఆశ్చర్యాన్నీ, అసంతృప్తినీ కలిగిస్తోంది.

అతడి ఆకర్షణ నన్ను బలంగా బంధించివేసింది. అతడు ఏంచేసినా, ఏంకోరినా నేను కాదనేస్థితిలోలేను.

ఒకరోజు అమ్మా నాన్న నా పెళ్ళి విషయమే మాట్లాడుకొంటున్నారు.

ఆ సంబంధం చేయడానికే నిశ్చయించారు.

సురేష్ ముందు అతడి రూపం ఊహించుకొంటూంటే నాకు కంపరంగా తోచింది. అతడినిచేసుకోనని కచ్చితంగా చెప్పాలనుకొన్నాను. ఇంతకంటే బేషైన సంబంధమే నేను ఎన్నుకొన్నానని గర్వంగా చెప్పాలనిపించింది.

ఇంతవరకు పెళ్ళి ప్రసక్తి మా మధ్య రాకపోయినా, నిన్ను ప్రేమిస్తున్నానని సురేష్ చెప్పకపోయినా అతడు తప్పకుండా నన్ను చేసుకొంటాడన్న నమ్మకం నాకుంది. అయితే ఇంతవరకూ అతడి కులమేమిటో, ఏ ఊరో తెలుసుకోలేదు. ప్రేమకు కులమేమిటి? మతమేమిటి? అతడి ప్రవర్తన నాకెంతో నచ్చింది.

ప్రేమించి పెళ్ళిచేసుకొంటానన్నప్పుడు కట్నం ప్రసక్తి వస్తుందా?

ఈ విధంగా అమ్మానాన్నకి కట్నం కానుకల బాధ తగ్గిస్తున్నాను.

సురేష్ సంగతి చెప్పెయ్యాలనుకొన్నానుగాని, అతడి అభిప్రాయం కనుగొనకుండా నోరు జారడంలో ప్రమాదం కనిపించి అప్పటికి మౌనం వహించాను.

ఉదయం కాలేజీకి వెడుతూ దారిలో "సాయంత్రం పార్క్‌కి వస్తారా?" అని అడిగాను.

"నాకేం భయంలేదు. నేనీ ఊరికి కొత్త. ఇక్కడి వాళ్ళకికొత్త. కాని, నీకు తెలిసినవాళ్ళెవరైనా కనిపిస్తే ...."

"కనిపిస్తే ఏం?"

"మీ వాళ్ళకి చెబితే?"

"చెబితే మాత్రం ఏం? నేనైనా ఒక రోజు చెప్పాల్సిందే కదా?"

"నువ్వే చెబుతావా? ఏమని?" అతడు కాస్త కంగారు పడ్డాడు.

"నాన పరిచయం గురించి!"

"వాళ్ళు అపార్థం చేసుకోరూ?"

"చెప్పవలసిన రీతిగా చెబితే ఎందుకు అపార్థం చేసుకొంటారు? అయినా మన మిప్పుడు ఏం కానిపని చేస్తున్నామని? మనసు కలసిన స్నేహితులతో కాస్సేపు కూర్చొని కబుర్లు చెప్పుకొంటే తప్పేమిటి?"

"ఓ! నువ్వు చాలా ధైర్యంకల పిల్లవి!" అతడు నవ్వాడు. సాయంత్రం ఆరింటికి పార్క్‌కి వస్తానన్నాడు.

ఎన్నోసార్లు రోడ్డుమీద కలుసుకొని మాట్లాడాం. సినిమాలకి వెళ్ళాం. అప్పుడెప్పుడూ జరగని అపూర్వసంఘటన ఈరోజు జరుగుతుందనిపించింది

సురేష్‌ని పెళ్ళిచేసుకొమ్మని అడిగితే ఏం చెబుతాడో? పార్క్‌లో చెట్లచాటున అతడి ఒడిలో పడుకొని తీయని కబుర్లు చెప్పుకొనే సన్నివేశం ఊహించుకొంటూంటే ఏదో చుక్కల లోకంలో విహరిస్తున్నట్టుగా తోచసాగింది.

అతడు ఆఫీసునుండి అయిదున్నరకి ఇంటికి రావడం చూశాను అతడుముఖం కడుక్కొని టవల్‌తో తుడుచుకుంటూ కిటికీ దగ్గరికివచ్చి, "రెడీయేనా?" అన్నట్టు సైగ చేశాడు.

నవ్వుతూ చెయ్యూపాను.

"అయితే నువ్వు ముందుపద," అన్నట్టు తిరిగి సైగచేశాడు.

ఓ ఫ్రెండింటికి నోట్సుతెచ్చుకొంటానని అమ్మకిచెప్పి నేను బయల్దేరాను. ఆ

నాకున్న చీరల్లో కాస్త మంచిచీర తెల్ల చీర కట్టుకొన్నాను. కాలేజీనుండి వస్తూ తెచ్చుకొన్న మల్లెచెండు తల్లో తురుము కొన్నాను. నా కిష్టమైన రీతిలో అలంక రించుకొన్నాను.

పార్క్ గేటువద్ద వచ్చి కలిశాడు సురేష్

ఇద్దరంవెళ్ళి ఒక పూపొద ప్రక్కగా కూర్చొన్నాం.

ఎలా సంభాషణ ప్రారంభించాలో నాకు తోచలేదు.

అతడే మొన్న చూసిన సినిమాగురించి ఏదో మాట్లాడాడు.

పరధ్యానంగా గడ్డిపరకలు నోటితో త్రుంచిపోస్తున్న నన్ను చూసి నవ్వాడు. "నువ్వీ లోకంలోలేవు!"

"సురేష్!" నేను హఠాత్తుగా, ఆవే శంగా అతడి చెయ్యి పట్టుకొన్నాను. "నా గురించి నీ అభిప్రాయమేమిటి?"

అతడు ఫక్కున నవ్వాడు. అదోలా నా వైపు చూస్తూ.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"నవ్వొస్తే నవ్వాను!"

"ఆ నవ్వే ఎందుకు వచ్చిందని అడుగుతున్నాను "

అతడు నవ్వు తగ్గించుకొని, "నీ గురించి నా అభిప్రాయం అడిగావుకదూ? చెబుతాను, విను. వయసు పొంగులో ఉన్నదానివి. పాలేవో నీళ్లేవో తెలియని దానివి. గ్రుడ్డిగా ప్రేమలో పడిపోయి, కలల తెప్పపై తేలిపోయేదానివి!" అన్నాడు.

"నా కలలు నిజమయ్యే అవకాశం నాకు లేదంటారా?"

"నేనా చెప్పాల్సింది? కాలం చెబు తుంది సమాధానం."

నా కళ్ళలో భయం రెపరెపలాడింది. "మీరు నన్ను పెళ్ళిచేసుకోరా?" అన్నాను వణికే కంఠంతో.

"మగవాడికి రెండు పెళ్ళిళ్ళు చట్ట సమ్మతం కావు!"


నా నెత్తిన పిడుగు పడింది. "మీకిది వరకే పెళ్ళి అయిపోయిందా?" పది లంకణాలు చేసినట్టుగా నా గొంతు నీరసించిపోయింది.

"నా పెళ్ళి అయి నెలా పదిహేను రోజులు అవుతోంది. నా భార్య చదువు కొంది. కథలూ, నవలలూ రాస్తుంది. ఆమె పేరు..." చెప్పాడు ఆమె పేరు.

నాకు కళ్ళు తిరిగినట్టయ్యాయి. ఈ మధ్యే ఆమె నవల సీరియల్‌గా ప్రభలో చదివాను ఆ నవలని ప్రశంసిస్తూ ఉత్తరం కూడా రాశాను ప్రభవాళ్ళకి.

"ఆమె అందంగురించి వర్ణిస్తే నీ మనసు బాధపడుతుంది ఇదిగో, ఆమె ఫోటో." సురేష్ పర్సులోంచి చిన్న ఫోటో తీసిచ్చాడు.

నా ముఖం అవమానంతో కంది పోయింది. "ఎందుకు నన్ను మోసం చేశారు?" కోపంగా అడిగాను.




"మోసంచేశానా ?" అతడు పరిహాసంగా చూశాడు.

"కాదా ? వివాహితులు. ఒక కన్నెపిల్ల జీవితంతో చెలగాటం అడ్డం కాదా?" దుఃఖంతో దోషంతో నా గొంతు పూడుకుపోయింది.

"నీ కన్నెరికాన్ని నేను చెడగొట్టలేదే ?" అతడు పెంకెగా అన్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది "ఈ స్నేహానికి అర్థమేమిటి ?" కస్సుమన్నాను.

"అర్థం చెప్పాలనే ఈ రోజు నువ్వు పిలవగానే ఇక్కడికి వచ్చాను" అతడు గంభీరంగా మారిపోయాడు. "ఎదురెదురు ఇళ్ళలో వయసొచ్చిన ఆడదీ, వయసులో ఉన్న మగాడూ కాపురముంటే ఇలాంటి సంఘటనలు మామూలేమో ! పాముకు కుబుసం విప్పితే కళ్ళు కనిపించకుండా మత్తుగా ఉంటుందట. ఈ వయసుకూడా అలాంటి కుబుసాన్నే కప్పుతుంది స్త్రీ పురుషులకు, ప్రపంచం కనిపించదు ప్రేమ తప్ప. తల్లీదండ్రీ, సమాజం కనిపించదు. ప్రియుడు తప్ప. కలలు తప్ప మరేవీ తీయగా ఉండవు. ఆ కలలను నిజం చేసుకొనే తాపత్రయంలో జీవితం ఒక పొరపాటుగా మారిపోతూ ఉంటుంది చాలామందికి. ముఖ్యంగా కన్నెపిల్లలకు.

"కిటికీలో నిలబడి నువ్వు పడే అవస్థ చూశాను. రోడ్డుమీద మనం కలిస్తే నువ్వు పొందే తన్మయం చూశాను. నా భార్య ఇంకో నెలరోజుల దాకా కాపురానికి రాదన్న విషయం నాకు గుర్తువచ్చింది. ఈ నెల రోజులూ సరదాగా నీతో కాలక్షేపం చేయొచ్చని నీ ఆహ్వానం అందుకొన్నాను :"

"ఛీ !" జుగుప్సగా చూశాను అతడి

కసు. నా కళ్ళకి అతడి రూపం వెగటుగా, అతడొక రాక్షసుడుగా, పరమా నీచుడిగా కనిపించసాగాడు.

''కాని, నీతో ఆడుకోవాలనుకొన్నప్పుడల్లా అమాయకమైన నా భార్య ముఖం గుర్తువచ్చేది. ఆమె ప్రేమ గుర్తువచ్చేది ప్రతి క్షణం నా ఊహతోనే ఆమె జీవిస్తోందన్న నిజం గుర్తువచ్చేది. దాంపత్యంలో వంచన అప్రఘటి భార్యా భర్తల్లో ఎవరి వైపునుండి ప్రవేసించినా అందుకు ఇద్దరూ సమానంగా నష్టపోవలసివస్తుంది. అందుకే నీతో స్నేహం చేసినా నిన్ను ఉంచవలసిన దూరంలోనే ఉంచాను. మా దాంపత్యం కలుషితం కాకుండా జాగ్రత్తపడ్డాను. ఈ చేదు నిజం నీకు చెప్పి, నీకు చిన్న హితవు కూడా చెప్పాలనుకొంటున్నాను. నన్ను కాక మరొకరిని ఆహ్వానిస్తే ఈపాటికి నీ అదృష్టం మరొక మలుపు తిరిగేది జీవితం తప్పటడుగుగా మారిపోయి ఉండేది. తొలిచూపు గారడీతో పడిపోయే ముందు ప్రతి ఆడపిల్లా తన చుట్టూ ఉన్న పరిస్థితులన్నీ ఒక్కసారి సమీక్షించుకోవడం మంచిది. మిగతా ప్రపంచాన్ని మరిచిపోవడం ఎవరికీ అంత మంచిదికాదు. ప్రేమించడం తప్పని అనను. కాని, ఈ ప్రేమ ఇచ్చిన వాళ్ళకి వరాన్ని ఇస్తుంది. లేకపోతే శాపం అవుతూంటుంది.

నీ శ్రేయోభిలాషిగా నేను చెప్పేది ఏమిటంటే సాధ్యమైనంత తర్వాలో ఈ సంఘటన మరిచిపో. మీ తలిదండ్రులు దూరదృష్టితో ఆదేశించిన మార్గంలో అడుగుపెట్టు. అదే ఏ ఆడపిల్లకైనా నిరపాయమైంది.''

నాకిక వినాలనిపించలేదు. థాంక్స్ చెప్పి లేచి బయల్దేరాను.

ప్రేమిస్తున్నాడనుకొంటున్న వాడి దృష్టిలో నేనెంత పరిహాస పాత్రమైపోయాను! అవమానంతో నా హృదయం కుతకుతలాడిపోయింది. కట్టుకొన్న గాలి మేడలన్నీ కుప్పకూలిపోయాయి.

నేనిక ఎప్పుడూ కిటికీదగ్గరకి వెళ్ళలేదు

కాలేజీకి వెళ్ళినా తలొంచుకుపోవడం, తలొంచుకొని రావడం నేర్చుకొన్నాను. వారంరోజుల తరువాత ఎదురింటి కిటికీలో ఒక అందమైన అమ్మాయి ముఖం కనిపించింది. చప్పున తిప్పుకొన్న నా కళ్ళలో నీళ్ళు నిలిచాయి.